క్లుప్తంగా

నేడు ఆటోనగర్‌లో విద్యుత్‌కు అంతరాయం

నగరంపాలెం: ఆటోనగర్ ఉపకేంద్రం పరిధిలో మరమ్మతుల దృష్ట్యా గురువారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు గడ్డిపాడు ఫీడర్స్ పరిధిలోని గణేష్‌నగర్, గడ్డిపాడు, ఏఎస్ కన్వెన్షన్ ఏరియా వినియోగదారులకు విద్యుత్ అంతరాయం ఏర్పడుతుందని టౌన్-4 డెప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ పీహెచ్. ఖాన్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. వినియోగదారులంతా సహకరించాలని ఆయన కోరారు.

'ఈద్గాపై ప్రతిపక్షాల విష ప్రచారం తగదు'

లక్ష్మీపురం: నగరంలో ఎంతో చారిత్రాత్మకమైన నగరంపాలెం ఈద్గాను కూలగొట్టి ఆక్రమణకు ప్రయత్నిస్తున్నారని ప్రతిపక్షాలు సోషల్ మీడియాలో ప్రచారం చేయడం తగదని జిల్లా వక్ఫ్ బోర్డు ఉపాధ్యక్షుడు మస్తాన్ ఖండించారు. ఈద్గా స్థలాన్ని బుధవారం కమిటీ సభ్యులతో కలసి ఆయన సందర్శించారు. స్థలాన్ని ఎవరికీ కేటాయించలేదని, ఆక్రమణకు గురి కాకుండా వక్ఫ్‌బోర్డు అధికారులు ఎప్పటికప్పుడు పరిశీలిస్తుంటారని ఆయన చెప్పారు.

అత్యవసర చికిత్స విభాగం వద్ద మరుగుదొడ్ల నిర్మాణం

గుంటూరు మెడికల్: అత్యవసర చికిత్స విభాగం వద్ద మరుగుదొడ్లు నిర్మించనున్నట్లు జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్ కుమార్ తెలిపారు. రెండు, మూడు రోజుల్లో నిర్మాణం చేపట్టేందుకు రంగం సిద్ధం చేస్తున్నట్లు వెల్లడించారు. అత్యవసర చికిత్స విభాగానికి సమీపంలో మార్చురీ పక్కనే ఉన్న స్థలాన్ని బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇంజినీరింగ్ శాఖ అధికారులతో కలసి స్థల పరిశీలన చేసినట్లు చెప్పారు. రూ. 10 లక్షలతో పురుషులకు, మహిళలకు విడివిడిగా మరుగుదొడ్లు, స్నానపు గదులు ఏర్పాటు చేయడానికి నిర్ణయించామని తెలిపారు.

జూదరుల అరెస్టు

పట్నంబజారు: పేకాట ఆడుతున్న వారిని పోలీసులు అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచారు. సీతమ్మ కాలనీలో బహిరంగ ప్రదేశంలో పేకాట ఆడుతున్న 18 మందిని నగరంపాలెం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ. 50,150 స్వాధీనం చేసుకున్నారు.

హామీలిచ్చి ప్రజల్ని మోసగించిన చంద్రబాబు




నగరంపాలెం: పేదలకు సంక్షేమ పథకాల్ని అందించిన ఘనత సీఎం వై.ఎస్.జగన్‌దేనని వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ నూరి ఫాతిమా పేర్కొన్నారు. 15వ డివిజన్‌లో బుధవారం జరిగిన 'మా నమ్మకం నువ్వే జగన్' కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గత టీడీపీ హయాంలో 700 హామీలిచ్చి ప్రజల్ని మోసగించిన వ్యక్తి చంద్రబాబు అని విమర్శించారు. వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ అభ్యర్థుల్ని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు మద్దిరెడ్డి సుధాకర్‌రెడ్డి, మురళి, గుదే నాగేశ్వరరావు, కరీముల్లా పాల్గొన్నారు.

పుస్తక పఠనంపై ఆసక్తి పెంచుకోండి

తెనాలిఅర్బన్: పుస్తక పఠనంపై విద్యార్థులు ఆసక్తిని పెంపొందించుకోవాలని జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత వేజళ్ల ఉమామహేశ్వర్ సూచించారు. గ్రంథాలయ వారోత్సవాల ముగింపును పురస్కరించుకుని వేజళ్ల వెంకట సుబ్బారావు మెమోరియల్ ఎడ్యుకేషన్ ట్రస్ట్ ఆధ్వర్యంలో బీసీ కాలనీలోని మున్సిపల్ ఎలిమెంటరీ స్కూల్‌లో బుధవారం నీతి కథల పుస్తకాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ట్రస్ట్ కార్యదర్శి వేజళ్ల నవ్య, సభ్యులు శ్రీదేవి, ఉపాధ్యాయులు బాలనర్సయ్య, అర్జున్, తిరుమలరావు తదితరులు పాల్గొన్నారు.

కుల గణన సమర్థంగా నిర్వహించాలి



మంగళగిరి: కుల గణన సమర్థంగా నిర్వహించాలని డీఎల్‌డీవో పద్మావతి కోరారు. స్థానిక రాజా వాసిరెడ్డి వేంకటాద్రినాయుడు కళావేదికలో కులగణనపై అధికారులకు, సిబ్బందికి బుధవారం శిక్షణ శిబిరం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ కుల గణనలో పాల్గొనే ప్రతి ఒక్కరూ క్షేత్రస్థాయి పర్యటించి వివరాలను తప్పకుండా యాప్‌లో అప్‌లోడ్ చేయాలని సూచించారు. ప్రతి ఇంటిని తప్పకుండా సందర్శించి పూర్తి వివరాలు నమోదు చేయాలని చెప్పారు. ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్ రెడ్డి ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కులగణన లెక్కింపులో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. గణన నిర్వహించే సిబ్బంది క్షేత్రస్థాయిలో పారదర్శకంగా ప్రతి ఇంటికి వెళ్లి పూర్తి వివరాలతో జాబితాలు రూపొందించాలని కోరారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్ లక్ష్మీపతిరాజు, టౌన్ ప్లానింగ్ సీపీఓ కె.అశోక్‌కుమార్, ఏసీపీ వెంకటేశ్వర్లు, సూపరింటెండెంట్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఎన్నికల విధులను పక్కాగా నిర్వహించాలి

నగర కమిషనర్ కీర్తి చేకూరి



అధికారులతో సమావేశమైన కమిషనర్ కీర్తి చేకూరి

నెహ్రూనగర్: ఓటర్ల చేర్పులు, తొలగింపులకు సంబంధించిన రిజిస్టర్‌ను బీఎల్‌వోలంతా సక్రమంగా నిర్వహించాలని, ఎన్నికల విధుల్లో నిర్లక్ష్యంగా ఉంటే కఠిన చర్యలు తప్పవని నగర కమిషనర్, తూర్పు నియోజకవర్గ ఈఆర్‌వో కీర్తి చేకూరి స్పష్టం చేశారు. తన క్యాంప్ కార్యాలయంలో బుధవారం ఎన్నికల విభాగ విధుల నిర్వహణపై ఏఈఆర్‌వోలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ కేంద్ర ఎన్నికల కమిషన్ మార్గదర్శకాల మేరకు క్షేత్రస్థాయిలో ఓట్ల చేర్పులు, తొలగింపులకు, షెల్టర్ లెస్ ఓటర్ల వివరాలకు సంబంధించిన రిజిస్టర్ తప్పనిసరిగా నిర్వహించాలని చెప్పారు. రెండు ప్రాంతాల్లో ఓట్లు ఉన్నవారికి ఫార్మేట్-ఏ ద్వారా రిజిస్టర్ పోస్ట్ చేయాలని సూచించారు. ఓటర్ల నుంచి వచ్చిన అంగీకారం మేరకు సరి చేయాలని, సదరు వివరాల్ని ఏఈఆర్‌వోలు ప్రత్యేక శ్రద్ధతో పరిశీలించాలని ఆమె స్పష్టం చేశారు. సెలవులో ఉన్నవారితో పాటు క్రమశిక్షణ చర్యలకు గురైన వారి స్థానంలో నూతన బీఎల్‌వోలను నియమించాలని ఎన్నికల విభాగ సూపరింటెండెంట్‌ని ఆదేశించారు. రాజకీయ పార్టీలు, ప్రజల నుంచి అందిన ఫారాల్ని ఎప్పటికప్పుడు ఆన్‌లైన్ ద్వారా పరిష్కరించాలని సూచించారు. తమ పరిధిలోని బీఎల్‌వోలతో సూపర్‌వైజరీ అధికారులు సమన్వయం చేసుకుంటూ ఎన్నికల విధుల్లో ఉండాలని ఆదేశించారు. సమావేశంలో పశ్చిమ ఈఆర్‌వో, అదనపు కమిషనర్ కె.లక్ష్మీ శివజ్యోతి, ఏఈఆర్‌వోలు, డెప్యూటీ కమిషనర్లు సీహెచ్.శ్రీనివాస్, బి.శ్రీనివాసరావు, సిటీప్లానర్ ప్రదీప్ కుమార్, సూపరింటెండెంట్లు సాంబశివరావు, పద్మ పాల్గొన్నారు.

విద్యార్థుల వర్క్‌బుక్స్ అప్‌డేట్ చేయాలి: డీవైఈవో



వర్క్‌బుక్స్ పరిశీలిస్తున్న డీవైఈవో వెంకటేశ్వరరావు

గుంటూరు ఎడ్యుకేషన్: విద్యార్థుల వర్క్‌బుక్స్ రెగ్యులర్‌గా పరిశీలించి అప్‌డేట్ చేయాలని గుంటూరు డీవైఈవో పి.వెంకటేశ్వరరావు ఉపాధ్యాయుల్ని ఆదేశించారు. చౌత్రా సెంటర్లోని ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలను బుధవారం ఆయన సందర్శించారు. వివిధ తరగతి గదులకు వెళ్లి, ఉపాధ్యాయుల బోధనతో పాటు తొమ్మిదో తరగతి విద్యార్థినుల వర్క్‌బుక్స్‌ను తనిఖీ చేశారు. ప్రతి రోజూ వాటిని పరిశీలించాలని, నోట్సులు, డైరీపై ఉపాధ్యాయులు సంతకం చేయాలని ఆదేశించారు. వర్క్‌బుక్స్, నోట్సులు పెండింగ్ లేకుండా చూడాల్సిన బాధ్యత ఉపాధ్యాయుల పైనే ఉందని తెలిపారు. విద్యార్థినుల వద్ద ప్రభుత్వం ఉచితంగా పంపిణీ చేసిన డిక్షనరీలు ఉన్నవీ, లేనివీ పరిశీలించారు. ఆయన వెంట ప్రధానోపాధ్యాయురాలు బి. విజయలక్ష్మి, ఉపాధ్యాయులు ఉన్నారు.

అయ్యప్ప మాలధారణతో క్రమశిక్షణ



సద్దిలో పాల్గొన్న శ్రీనివాసరావు తదితరులు

గుంటూరు వెస్ట్: కఠోర నియమాలతో, అకుంఠిత దీక్షతో చేసే అయ్యప్ప మాలధారణతో జీవితంలో చక్కని క్రమశిక్షణ అలవడుతుందని 32వ డివిజన్ కార్పొరేటర్ ఈచంపాటి ఆచారి తెలిపారు. అయ్యప్ప సేవా సమితి ఆధ్వర్యంలో బుధవారం బ్రాడీపేట 5/17లోని అయ్యప్ప స్వామి దేవాలయంలో సద్ది కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆచారి మాట్లాడుతూ మనిషికి నిజమైన ప్రశాంతత ఆధ్యాత్మిక సేవలోనే ఉంటుందని చెప్పారు. అయ్యప్ప సేవా సమితి, భక్త బృందం చేపట్టిన ఈ కార్యక్రమం నిర్విరామంగా జరగాలని ఆకాంక్షించారు. కమిటీ సభ్యుడు భావన్నారాయణ మాట్లాడుతూ జనవరి 3వ తేదీ వరకు ఈ కార్యక్రమం ఉంటుందని తెలిపారు. ప్రతి రోజూ రాత్రి 7:30 గంటలకు భజన ప్రారంభించి సద్దితో (అన్నప్రసాదం) ముగిస్తామని చెప్పారు. కార్యక్రమంలో అయితి సతీష్, అప్పారావు, సుబ్బారావు, ఎ.శ్రీనివాస్ పాల్గొన్నారు.

అయ్యప్ప స్వాములకు సద్ది ప్రారంభం

కొరిటెపాడు(గుంటూరు): నగరంలోని నెహ్రూనగర్ మెయిన్ రోడ్డులో గల కోదండ రామాలయంలో వేద సీడ్స్ మేనేజింగ్ డైరెక్టర్ పి. చంద్రశేఖర్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ తులసి ధర్మచరణ్ సహకారంతో అయ్యప్ప స్వాములకు ఆలయ ధర్మకర్త ఆళ్ల శ్రీనివాసరావు సద్ది ఏర్పాటుచేశారు. తొలి రోజు బుధవారం స్వామి చిత్రపటానికి ప్రత్యేక పూజలు నిర్వహించి, మహా నైవేద్యం సమర్పించారు. అనంతరం స్వాములకు సద్దిని వడ్డించారు. నెహ్రూనగర్ పరిసర ప్రాంతాల్లోని దీక్షాపరులంతా ప్రతి రోజు సద్దిలో పాల్గొనాలని ఆళ్ల శ్రీనివాసరావు కోరారు. కార్యక్రమంలో బండి రామప్రభు, డేగల వెంకట్రావు, ఇంకొల్లు శంకరరావు, పులికొండ భాస్కరరావు, చెన్ను రవికుమార్, తోట అనిల్, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమం, రాష్ట్రాభివృద్ధికి సీఎం జగన్ కృషి


ప్రముఖ క్రికెటర్ అంబటి రాయుడు



పొదుపు సంఘాల మహిళల సమావేశంలో మాట్లాడుతున్న క్రికెటర్ అంబటి

గుంటూరు రూరల్: ప్రజా సంక్షేమం, రాష్ట్రాభివృద్ధి కోసం రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారని ప్రముఖ క్రికెటర్ అంబటి రాయుడు తెలిపారు. మండలంలోని వెంగళాయపాలెంలో బుధవారం ఆయన పర్యటించారు. ముందుగా గ్రామ ప్రారంభంలో మహానేత డాక్టర్ వై.ఎస్. రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఎస్సీ విభాగం మండల కన్వీనర్ కలిశెట్టి వెంకటరావు ఆధ్వర్యంలో భారీ బైక్ ర్యాలీని ఏర్పాటు చేసి సాదర స్వాగతం పలికి, గ్రామంలోకి తీసుకెళ్లారు. లక్ష్మీ నరసింహపురం కాలనీలోని శ్రీ షిర్డీ సాయినాథుడి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. కమిటీ సభ్యులు అంబటి రాయుడికి పూర్ణకుంభంతో సాదర స్వాగతం పలికి, ఘనంగా సన్మానించారు. గ్రామంలో సమస్యలు, అభివృద్ధి కార్యక్రమాలపై పెద్దలతో చర్చించారు. అభయాంజనేయస్వామి, శ్రీరామాలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. స్థానిక పెద్దలతో మాట్లాడారు. గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించి విద్యార్థులతో మాట్లాడారు. ప్రతి ఒక్కరూ లక్ష్య సాధన దిశగా కృషి చేయాలని తెలిపారు. క్రీడలు ఎంతో అవసరమని, విద్యార్థి దశ నుంచే వాటిల్లో ప్రావీణ్యత సాధించాలని విద్యార్థులకు సూచించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి విద్యకు అధిక ప్రాధాన్యత ఇచ్చి, ప్రతి పేదవానికి కార్పొరేట్ స్థాయి విద్యను అందిస్తున్నారని తెలిపారు. విద్యార్థులకు అనేక సంక్షేమ పథకాల్ని అందజేస్తున్నారని చెప్పారు. అనంతరం గ్రామ కూడలిలోని జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. స్థానికంగా ఉన్న చర్చి, మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో రూరల్ మండలం జెడ్పీటీసీ, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ తుమ్మల సుబ్బారావు, జేసీఎస్ కన్వీనర్, దాసుపాలెం సర్పంచ్ ఎదురుపాక వెంకట్, సచివాలయం కన్వీనర్ రేటూరి శివబ్రహ్మం, నేతలు అద్దంకి దర్మారావు, దుగ్గెంపూడి శ్రీనివాస రెడ్డి, ముప్వ బుజ్జమ్మ, జయరాజు, బాజీ, యర్రంశెట్టి బాబూరావు, యర్రంశెట్టి పెద్దబ్బాయి, దుర్గ, శ్రీకాంత్, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

శివనామావళి-గీతమాలిక పుస్తకావిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న డాక్టర్ శారద, గోపాలకృష్ణమూర్తి, వెంకటసుబ్బయ్య

తెనాలి టౌన్: కార్తిక మాసంలో శివభక్తులకు శివనామావళి-గీతమాలిక పుస్తకాన్ని కానుకగా ఇస్తున్నట్లు వైద్యురాలు డాక్టర్ డి.శారద పేర్కొన్నారు. కొత్తపేటలోని ఓ ఫంక్షన్ హాలులో బుధవారం శ్రీశైల భక్త సేవాసమితి తెనాలి ఆధ్వర్యంలో విశ్రాంత తెలుగు ఉపాధ్యాయుడు పొన్నపల్లి గోపాలకృష్ణమూర్తి రచించిన శివనామాళి-గీతమాలిక పుస్తకాన్ని డాక్టర్ శారద, రచయిత గోపాలకృష్ణమూర్తి, సేవాసమితి సభ్యులు ఆవిష్కరించారు. సభకు సేవాసమితి అధ్యక్షుడు ఎ.వెంకటసుబ్బయ్య అధ్యక్షత వహించారు. సభలో డాక్టర్ శారద మాట్లాడుతూ కరోనా సమయంలో వైద్యుడిగా చేసిన సేవలను పలువురు అభినందిస్తున్నారన్నారు. విలువలతో ధర్మాన్ని విడనాడకుండా సేవా కార్యక్రమాలను ఊపిరిగా చేస్తున్నామన్నారు. సత్యం, ధర్మాన్ని ప్రకటించాలంటే ధైర్యం కావాలని చెప్పారు. రచయిత గోపాలకృష్ణమూర్తి మాట్లాడుతూ శివునికి పూజించే వారికంటే భక్తులకు సేవచేయడమే ఆయనకు ఎంతో ఇష్టమన్నారు. సేవా సమితి శివరాత్రి రోజు శ్రీశైలంలో అన్నదానం చేయడం ఎంతో గొప్ప విషయమని కొనియాడారు. గురువులతో సంభాషించి, అనుమతి తీసుకుని శివసహస్రనామాలు, అష్టోత్తర నామాలనుంచి కొన్ని సేకరించి శివనామాళి గీతమాలిక పుస్తకం తయారు చేశామన్నారు. కార్తికమాసంలో భక్తులకు అందించాలనే ప్రయత్నం సఫలీకృతమైందని తెలిపారు. జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత అయినాల మల్లేశ్వరరావు కార్తికమాస విశిష్టతను వివరించారు. కార్తిక మాసంలో 30 రోజులు అనేక కార్యక్రమాలు చేయడం ఆరోగ్యదాయకమన్నారు. సేవాసమితి అధ్యక్షుడు వెంకటసుబ్బయ్య, ఉపాధ్యక్షుడు ఎం.మల్లికార్జునరావు, సెక్రటరీ పరిమి గోవర్ధన్, కోశాధికారి కోన బ్రహ్మానందం, ముఖ్యకార్యకర్తలు కొడాలి భారతి, వెంపటి రవీంద్ర, శాంతకుమారి, నాగసుధాకర్, ప్రసాద్, వెంపటి సత్యనారాయణ, లక్కరాజు సాయి పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు రెడ్‌క్రాస్ సాయం

తెనాలి: కొల్లిపర మండలంలోని మున్నంగిలో మూడురోజుల క్రితం జరిగిన అగ్నిప్రమాదంలో సర్వస్వం కోల్పోయిన కుటుంబాలకు స్టీలు సామగ్రి, వస్త్రాలు, దుప్పట్లు, టూత్‌పేస్ట్, సబ్బులను బుధవారం స్థానిక ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ కార్యాలయంలో అందజేశారు. రెడ్‌క్రాస్ సొసైటీ, తెనాలి చైర్‌పర్సన్ ముమ్మనేని భానుమతి ఆధ్వర్యంలో మున్నంగి గ్రామానికి చెందిన తుమ్మ సుజాత, ఈద సామ్రాజ్యానికి అందించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు దేసు శ్రీనివాస్, అక్కిదాసు కిరణ్, కృష్ణారావు, రెడ్‌క్రాస్ కోశాధికారి నాళం శ్రీమన్నారాయణమూర్తి పాల్గొన్నారు.

ఫైలేరియా బాధితులకు పాదరక్షల పంపిణీ

తెనాలి: రోటరీ క్లబ్ ఆఫ్ తెనాలి వైకుంఠపురం ఆధ్వర్యంలో బుధవారం స్థానిక పాత ప్రభుత్వ వైద్యశాలలో గల ఫైలేరియా విభాగంలో 25 మందికి ఉచితంగా ప్రత్యేక పాదరక్షలను పంపిణీ చేశారు. క్లబ్ అధ్యక్షుడు పావులూరి రాంబాబు మాట్లాడుతూ స్థానిక వనరులను ఉపయోగించుకుని ఫైలేరియా బాధితులకు తమ వంతు సహకారాన్ని అందిస్తున్నట్టు చెప్పారు. లెప్రా సొసైటీ కోరిన మీదట రోటరీ సభ్యులు కన్నెగంటి మురళీకృష్ణ, వీరవల్లి మురళీకృష్ణ, నరేష్‌కుమార్ జైన్ సహకారంతో రూ.10 వేల ఆర్థికసాయాన్ని అందజేసినట్టు చెప్పారు. ఫైలేరియా బాధితులకు, లెప్రా సొసైటీకి సాయం అభినందనీయమని రోటరీ అసిస్టెంట్ గవర్నర్ కన్నెగంటి మురళీకృష్ణ కొనియాడారు. లెప్రా ప్రాజెక్ట్ అసోసియేట్ అబ్దుల్ వహీద్ బాషా, ఎస్పీవో వి.పున్నారెడ్డి, ఎస్‌హెచ్ఐ ఎన్ఎఫ్‌సీపీ యూనిట్ తెనాలి జి.రవికుమార్, రోటరీ సభ్యులు గుత్తా వెంకటరత్నం, ఈదర వెంకట పూర్ణచంద్, ఈదర శ్రీనివాసరావు, జీవీ నారాయణ, జాన్ కిడ్స్, ఆలపాటి కిరణ్, నరేష్‌కుమార్ జైన్, నల్లూరి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

స్పిన్నింగ్ మిల్లులో కార్మిక శాఖ అధికారుల తనిఖీ

16 మంది బాలకార్మికుల గుర్తింపు

మేడికొండూరు: సిరిపురం రోడ్డులోని ఓ స్పిన్నింగ్ మిల్లులో బుధవారం బాలకార్మిక నియంత్రణ శాఖ అధికారులు దాడి చేశారు. మిల్లులో 16 మంది బాల కార్మికులను గుర్తించారు. నిబంధనల మేరకు లోబడి కంపెనీ యాజమాన్యంపై కేసు నమోదు చేశారు. బాల కార్మికులను గుంటూరు చైల్డ్ వెల్ఫేర్ ప్రొటెక్షన్ శాఖ అధికారులకు అప్పగించారు. ఒడిశా నుంచి కొన్ని కుటుంబాలు కూలి పనుల కోసం తక్కువ కూలితో మధ్యవర్తుల ద్వారా బాల కార్మికులను ఇక్కడకు తీసుకొస్తున్నట్లు అధికారుల పరిశీలనలో వెల్లడైంది. తనిఖీల్లో యాంటీ ఉమెన్ ట్రాఫిక్ ప్రొటెక్షన్ ఏఎస్ఐలు బేబీ రాణి, లక్ష్మి, పీసీలు బేబమ్మ, గాయత్రి, లేబర్ ఇన్‌స్పెక్టర్ దేవసేన, ఏఎల్వో రెడ్డి, చైల్డ్ అడ్వకసీ ఫౌండేషన్ చైర్మన్ స్వర్ణలత, సరిత, జిల్లా లీగల్ సొసైటీ ప్యానల్ మెంబర్ కాళిదాసు, పాల్గొన్నారు.

పురుగు మందు తాగి యువకుడి ఆత్మహత్య

తాడికొండ: పురుగుమందు తాగి యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన తాడికొండలో చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన షేక్ మహమ్మద్ ఖలీల్(27) ఉబ్బసం వ్యాధితో బాధపడుతూ ఇబ్బంది పడుతున్నాడు. మంగళవారం పురుగు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. జీజీహెచ్‌కు తరలించగా చికిత్స పొందుతూ మరణించినట్లు బంధువులు తెలిపారు.

ఇన్సూరెన్స్ విశ్రాంత ఉద్యోగుల ఆందోళన

తెనాలి: స్థానిక బోసురోడ్డులోని ఓరియంటల్ ఇన్సూరెన్స్ కార్యాలయం ఎదుట బుధవారం జనరల్ ఇన్సూరెన్స్ కంపెనీల విశ్రాంత ఉద్యోగులు ఆందోళన చేశారు. రిజర్వుబ్యాంకు ఇతర కమర్షియల్ బ్యాంకులు, ఇన్సూరెన్స్ కార్పొరేషన్‌తో సమానంగా జనరల్ ఇన్సూరెన్స్ విశ్రాంత ఉద్యోగులకు కూడా ఇప్పుడున్న ఫ్యామిలీ పెన్షన్ సదుపాయాన్ని 30 శాతానికి పెంచాలని డిమాండ్ చేశారు. ఈ విషయమై కేంద్రప్రభుత్వ ఆర్థిక శాఖతో సెప్టెంబరు నుంచి సంప్రదింపులు జరుపుతున్నామని గాలి భూషణబాబు, యడ్లపల్లివెంకటేశ్వరరావు తెలిపారు. దీనితోపాటు పెన్షన్ అప్డేషను, జాతీయ పెన్షన్ పాలసీ సవరణలు కూడా డిమాండ్ చేస్తున్నట్టు తెలిపారు. ప్రదర్శన అనంతరం స్థానిక ఓరియంట్ ఇన్సూరెన్స్ కంపెనీ మేనేజరుకు తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. ది ఓరియంటల్, యునైటెడ్ ఇండియా, న్యూ ఇండియా, నేషనల్ ఇన్సూరెన్స్ కంపెనీల విశ్రాంత/ రెగ్యులర్ ఉద్యోగులు జి.కృష్ణయ్య, కె.చంద్రమౌళి, పి.పల్లంబరావు, వి.శ్యామసుందరరావు, బి.రవికుమార్, పి.కృష్ణప్రసాద్, డి.ప్రసాదరావు, కె.రామారావు, పి.నాగేశ్వరరావు, బి.అశోక్, పి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

నగరపాలక సంస్థలో ఆధార్ బయోమెట్రిక్ నవీకరణ



ఆధార్ బయోమెట్రిక్ అప్డేట్ చేసుకుంటున్న పింఛన్ లబ్ధిదారులు

నెహ్రూనగర్: పింఛన్ పంపిణీలో బయోమెట్రిక్ సమస్యల పరిష్కారానికి గానూ ఆధార్ బయోమెట్రిక్ అప్డేట్(నవీకరణ) క్యాంప్ ఏర్పాటు చేశామని నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ కె.లక్ష్మీ శివజ్యోతి తెలిపారు. నగర కమిషనర్ కీర్తి చేకూరి ఆదేశాల మేరకు నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలో బుధవారం ప్రత్యేక శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా అదనపు కమిషనర్ మాట్లాడుతూ నగరంలో పింఛన్ పంపిణీ సమయంలో కొందరికి ఆధార్ బయోమెట్రిక్ ఫెయిల్యూర్ అవుతోందని తెలిపారు. అటువంటి వారిని వార్డ్ సచివాలయాల వారీగా గుర్తించి, సమస్య పరిష్కారానికి గానూ యూఐడీఏఐకి రిపోర్ట్ పంపామని తెలిపారు. ఆ కార్యాలయ సిబ్బంది బుధవారం జీఎంసీలో శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు అదనపు కమిషనర్ చెప్పారు. పలువురు పింఛన్‌దారులకు ఆధార్ అప్డేట్ చేసినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో మేనేజర్ శివన్నారాయణ, ఉపా సెల్ పీవో సాంబశివరావు, డీఆర్డీఏ ఏపీవో లక్ష్మి, యూఐడీఏఐ రీజినల్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఫార్మసీ వారోత్సవాల్లో ఆకట్టుకున్న పుస్తక ప్రదర్శన



పుస్తకాలను తిలకిస్తున్న విద్యార్థులు

గుంటూరు ఎడ్యుకేషన్: అమరావతి రోడ్డులోని హిందూ ఫార్మసీ కళాశాలలో బుధవారం 62వ జాతీయ ఫార్మసీ వారోత్సవాల్లో భాగంగా పుస్తక ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.వి.నాగభూషణం కళాశాలలోని వివిధ విభాగాల వారీగా ఏర్పాటు చేసిన కార్యక్రమాల్ని గురించి వివరించారు. ఈ ఏడాది భారతీయ ఔషధ మండలి ప్రతిపాదించిన ''జాయిన్ ఫార్మాసిస్ట్స్ టు ఎన్స్యూర్ పేషెంట్ సేఫ్టీ'' అనే నినాదంపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. ఈ సందర్భంగా షా బుక్ హౌస్ ఆధ్వర్యంలో జి. సురేష్‌బాబు సహకారంతో ఫార్మసీ పుస్తక ప్రదర్శనతో పాటు లియో గ్లోబల్ ఓవర్సీస్ ఎడ్యుకేషన్ సహకారంతో విదేశీ విద్యపై అవగాహన కల్పించారు. యూఎస్ఏ, కెనడా, యూకేల్లో ఉన్నత విద్యను అభ్యసించేందుకు అవకాశాలు, అర్హతలపై విద్యార్థులకు వివరించారు. విద్యార్థులకు ఐఈఎల్ట్స్‌లో ఉచితంగా శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కళాశాల చైర్మన్ జూపూడి రంగరాజు, కరస్పాండెంట్ డాక్టర్ ఎస్. మధుసూదనరావు, వైస్ ప్రిన్సిపాల్ కె. రవికుమార్, ఫార్మాడీ డైరెక్టర్ పి. సీతారామయ్య, విభాగాధిపతులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

నిధుల దుర్వినియోగంపై డీఎల్పీవో విచారణకు బ్రేక్

- వెనిగండ్ల పంచాయతీ కార్యాలయంలో ఇరువర్గాల ఘర్షణ
- విచారణ అర్ధంతరంగా ముగించి వెళ్లిపోయిన డీఎల్పీవో



వెనిగండ్ల పంచాయతీలో విచారణ చేస్తున్న డీఎల్‌పీవో లక్ష్మణరావు

పెదకాకాని: నిబంధనలకు విరుద్ధంగా బిల్లులు డ్రా చేయడంపై విచారణ చేసేందుకు బుధవారం డీఎల్‌పీవో లక్ష్మణరావు వెనిగండ్ల పంచాయతీ కార్యాలయానికి చేరుకున్నారు. ముందస్తుగా సమాచారం అందుకున్న రెండు వర్గాలు కార్యాలయానికి చేరుకుని డీఎల్‌పీవో ఎదుటే వాగ్వివాదానికి దిగాయి. ఆయన సర్ది చెప్పినప్పటికీ వినిపించుకోలేదు. దీంతో విచారణను అర్ధంతరంగా ముగించేసుకొని అక్కడి నుంచి గుంటూరు వెళ్లిపోయారు. వెనిగండ్ల పంచాయతీలో అనేక అక్రమాలు జరిగినట్లు అదే గ్రామానికి చెందిన అంబేడ్కర్ అధ్యయన కేంద్రం తరఫున వల్లభాపురపు ప్రేమ్ సాగర్ ఫిర్యాదు చేశారు. సర్పంచి వేల్పుల శ్రావణి పంచాయతీకి సంబంధించిన రూ. 40 లక్షలను నిబంధనలు విరుద్ధంగా డ్రా చేశారని ఫిర్యాదు చేశారు. రెండేళ్లుగా గ్రామంలో జంగిల్ క్లియరెన్స్, పారిశుద్ధ్య మెరుగుదల, మరమ్మతులు, వివిధ రకాల వస్తువుల కొనుగోళ్లపై విచారణ చేపట్టాలని ఫిర్యాదులో పేర్కొన్నారు. కొద్ది రోజుల కిందట నేరుగా జిల్లా కలెక్టర్‌కు స్పందనలో ఫిర్యాదు అందజేశారు. దీనిపై విచారణకు వెళ్లిన డీఎల్‌పీవో ఎదుటనే ఇరువర్గాలు ఘర్షణ పడ్డాయి. దీనిపై ఆయన మాట్లాడుతూ గ్రామంలో కొందరి నుంచి స్టేట్‌మెంట్ తీసుకున్నట్లు చెప్పారు. పూర్తిస్థాయిలో విచారణ పూర్తి చేసి త్వరలో డీపీవో ద్వారా కలెక్టర్‌కు నివేదిక అందజేస్తామని తెలిపారు.

మహాధర్నాను జయప్రదం చేయండి

తాడేపల్లిరూరల్: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కర్షక, కార్మిక ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా నిర్వహించనున్న మహాధర్నా జయప్రదం చేయాలని రైతు సంఘం గుంటూరు జిల్లా అధ్యక్షులు జొన్నా శివశంకరరావు పిలుపునిచ్చారు. మంగళగిరి రైతు సంఘం కార్యాలయంలో విస్తృత స్థాయి సమావేశం బుధవారం నిర్వహించారు. శివశంకరరావు మాట్లాడుతూ కార్పొరేట్ సంస్థలకు అనుకూలంగా ఉన్న ప్రధాన మంత్రి పంటల బీమా పథకాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. సమగ్ర ప్రభుత్వ రంగ పంటల బీమా సంస్థను ఏర్పాటు చేయాలని కోరారు. పోలవరం నిర్వాసితులకు పరిహారం చెల్లింపు, పునరావాసం కల్పించాలని అన్నారు. ఈనెల 27, 28 తేదీలలో విజయవాడలో జరిగే మహాధర్నాకు రైతులు, కార్మికులు పెద్ద సంఖ్యలో తరలి రావాలని పిలుపునిచ్చారు. సమావేశంలో రైతు సంఘం నాయకులు వి.భారతి, జి.నాగేశ్వరరావు, బి.జానారెడ్డి, ఎ. సాంబిరెడ్డి, గోపాల్‌రోడ్డి, ఎ.ప్రకాష్‌రావు, బి.సత్యమారెడ్డి, ఎస్.రామిరెడ్డి పాల్గొన్నారు.

సమాజంలోని అనర్థాలపై అప్రమత్తత అవసరం



మాట్లాడుతున్న పల్నాటి నాగరాజు

తెనాలి: సమాజంలో యువతులపై జరుగుతున్న అనర్థాలపై అప్రమత్తంగా ఉండాలని హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ జిల్లా అధ్యక్షుడు పల్నాటి నాగరాజు సూచించారు. స్థానిక దేవీచౌక్‌లోని శ్రీచైతన్య కాలేజీలో ప్రిన్సిపాల్ నన్నపనేని సునీల్ అధ్యక్షతన బుధవారం విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. యువతులు, మహిళలపై సమాజంలో నిత్యం చోటుచేసుకుంటున్న అకృత్యాలను నాగరాజు వివరించారు. వాటి బారిన పడకుండా విద్యార్థినులు జాగ్రత్తగా వ్యవహరించాలని పలు సూచనలు చేశారు. తల్లిదండ్రుల కష్టాన్ని గుర్తెరిగా, వారిపట్ల తమ బాధ్యతను నెరవేర్చుకునేందుకు కష్టపడి చదవటం, ఉన్నతస్థాయిలో స్థిరపడటమే తమ కర్తవ్యంగా విద్యార్థులు లక్ష్యంగా నిర్ణయించుకోవాలని చెప్పారు. సోషల్ మీడియాను సద్వినియోగం చేసుకోవాలని, దుర్వినియోగం చేసుకుంటే వాటి దుష్ఫలితాలను అనుభవించాల్సి వస్తుందని హెచ్చరించారు. ప్రిన్సిపాల్ సునీల్ మాట్లాడుతూ కాలాన్ని ఎలా సద్వినియోగం చేసుకోవాలో సూచించారు. కార్యక్రమంలో హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ జిల్లా అదనపు ప్రధాన కార్యదర్శి ఆరే మరియదాసు, బుద్ధిస్టు సొసైటీ రాష్ట్ర కార్యర్శి అశోక్, ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యత జిల్లా అధ్యక్షుడు శివకృష్ణ, ఉపాధ్యక్షుడు బ్రహ్మానందరెడ్డి, కాలేజీ బోర్డు ప్రిన్సిపాల్ మాల్యాద్రి మాట్లాడారు.

బహిరంగ ప్రకటన

[illegible]

నందిగల ప్రసాద్ రెడ్డి, అడ్వకేట్

